క్లుప్తంగా

జగనన్నకు ప్రజల జేజేలు



ఉండిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉండి: నువ్వే కావాలి జగన్, నువ్వే మళ్లీ మళ్లీ రావాలని ప్రజలంతా జేజేలు పలుకుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం ఉండిలో నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తోన్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఇంటి యజమానుల అనుమతితో స్టిక్కర్లు అంతికించారు. ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకిచ్చిన ప్రతి వాగ్దానాన్నీ నెరవేర్చడంతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ మహంకాళి, రాష్ట్ర జానపద కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కరిమెరక చంద్రరావు, యేడిద వెంకటేశ్వరరావు, కమతం బెనర్జీ, కరిమెరక శివనాగరాజు, ఎంపీటీసీ గిరడ రమణ శ్రీను, గలావిల్లి ధనుంజయ, అంగర రాంబాబు, రాయి సతీష్, శేషాద్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిజమే ప్రపంచానికి ప్రత్యామ్నాయం

సాక్షి, భీమవరం: కమ్యూనిజమే ప్రపంచానికి ప్రత్యామ్నాయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం అన్నారు. శనివారం లెనిన్ జయంతి సందర్భంగా పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ ప్రపంచ కార్మిక వర్గ మహానేత, కమ్యూనిస్టు సిద్ధాంత కర్త, సోవియట్ రాజ్య నిర్మాత లెనిన్ కమ్యూనిస్టులకు, ప్రగతిశీల శక్తులకు చాలా సుపరిచితమైన వ్యక్తి అన్నారు. ప్రపంచంలో తొలి కార్మిక రాజ్యాన్ని నిర్మించడంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి బలరాం, జేఎన్‌వీ గోపాలన్, చింతకాయల బాబురావు, పీవీ ప్రతాప్, కర్రా నాగేశ్వరరావు, కె. రాజా రామ్మోహన్ రాయ్ పాల్గొన్నారు.

పంట బోదెలో పూడికతీత



రాయకుదురులో పంట బోదెలో పూడికతొలగిస్తున్న కూలీలు

వీరవాసరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ప్రతి ఒక్కరూ సద్వినియోగపరుచుకోవాలని సర్పంచ్ గడ్డం భారతి తెలిపారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో భాగంగా శనివారం రాయకుదురులోని పంట బోదెలు పూడికతీత పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ గడ్డం భారతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు పెద్ద ఎత్తున అమలు చేస్తున్నామన్నారు. ఉపాధి హామీ పనులు రైతులకు ఉపయోగపడే విధంగా ఎస్టిమేట్లు తయారుచేసి ఇవ్వాలని సూచించారు. ముందుగా కొబ్బరికాయ కొట్టి, పూజలు నిర్వహించి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చిలకపాటి సునీత, ఫీల్డ్ అసిస్టెంట్ వాస పెద్దింటమ్మ పాల్గొన్నారు.

సొసైటీల ద్వారా రైతులకు మేలు



విస్సాకోడేరు సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

పాలకోడేరు: సహకార సంఘాల ద్వారా రైతులకు ప్రభుత్వం అనేక ప్రయోజనాలను కల్పిస్తోందని ఎంపీపీ భూపతిరాజు చంటిరాజు అన్నారు. విస్సాకోడేరు సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా శనివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. సొసైటీ చైర్మన్ గెద్దం జోషి, సభ్యులు సామంతపూడి మారాజు, బాలాజీలను ఎంపీపీ చంటిరాజు, విస్సాకోడేరు, గొరగనమూడి, పాలకోడేరు సర్పంచులు బొల్లా శ్రీనివాస్, గొట్టుముక్కల శివరామరాజు (శివాజీ రాజు) ఇంజేటి మరియమ్మ, మాజీ సర్పంచులు పెన్మత్స శ్రీనివాసరాజు, చెల్లబోయిన పాపారావు, దుండి అశోక్ బాబు, గ్రామపెద్దలు పిన్నమరాజు సహదేవరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ పాలా రాధాకృష్ణ బొకేలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ధాన్యాన్ని సొసైటీల ద్వారా కొనుగోలు చేయించి రైతులకు గిట్టుబాటు ధరలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

అలరించిన నృత్యప్రదర్శనలు

నరసాపురం: స్థానిక ఆదిపరాశక్తి నృత్యనికేతనం విద్యార్థులు పట్టణంలోని ఆదికేశవ ఎంబేరుమానార్‌స్వామి ఆలయం వద్ద ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. శ్రీరామానుజస్వామివారి తిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

త్వరలో రెండో విడత టిడ్కో గృహాల పంపిణీ

- అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): టిడ్కో గృహాలకు సంబంధించి ఎస్టీపీ ప్లాంట్ పనులు త్వరితగతిన జరుగుతున్నాయని, ఈ పనులు పూర్తయిన వెంటనే రెండో విడత టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగిస్తామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. శనివారం రాత్రి భీమవరంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా రూ.80 లక్షల నిధులతో తాడేరు రోడ్డులో 700 కుటుంబాలకు అవసరమయ్యే సీసీ డ్రైన్, కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. అనంతరం రూ.11.70 లక్షల నిధులతో టిడ్కో గృహాల వద్ద ఏర్పాటుచేసిన సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొదటి విడతగా 2 వేల మంది లబ్ధిదారులకు గృహాలను అప్పగించామన్నారు. రెండో విడతగా 2,500 మందికి గృహాలను అప్పగించే విధంగా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో తాడేరు రోడ్డులో నిర్మించిన 700 గృహాలకు అన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశామని, ప్రస్తుతం రూ.80 లక్షల నిధులతో సీసీ డ్రైన్, కల్వర్టు నిర్మిస్తున్నామని అన్నారు. పట్టణాభివృద్ధికి కట్టుబడి పని చేస్తున్నామని అన్నారు. ప్రతి వార్డులోనూ శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులను చేపట్టామని పేర్కొన్నారు. ప్రస్తుతం టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, మున్సిపల్ కమిషనర్ ఎస్ శివరామకృష్ణ, ఎంఈ త్రినాధరావు, కామన నాగేశ్వరరావు, గూడూరి ఉమాబాల, పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, ఏఎస్ రాజు, నల్లం రాంబాబు, యర్రంశెట్టి కొండ, కొండేటి సుధాకర్, దాయాని ప్రసాద్, పోతుల శేఖర్, చింతాడ శ్రీనివాస్, గునుపూడి ప్రకాష్, కాట్రగడ్డ దీన, మాదిరెడ్డి శ్రీనివాస్, చెల్లబోయిన సూర్యప్రకాష్, కందికట్ల ఎడ్వర్డ్, చిగురుపాటి సందీప్, నా మన మహేష్, కోమటి రాంబాబు, కోళ్ల బాలకృష్ణ, చిల్లి వెంకటేష్, నల్లం రత్నకుమారి, గంటా సుందర్ కుమార్, పాలపర్తి జోనా , మున్సిపల్ డిఈ తోట నారాయణరావు, పలువురు ఏఈలు పాల్గొన్నారు.

జగన్ పాలనలో శివారు గ్రామాల అభివృద్ధి



వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్

కాళ్ల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో శివారు గ్రామాలు సైతం అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని మాలవానితిప్ప సర్పంచ్ సాగిరాజు సుబ్బరాజు అన్నారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన గ్రామ పెద్దలతో కలిసి శనివారం పరిశీలించారు. నాడు నేడు పథకంలో భాగంగా రూ.కోటితో జిల్లా పరిషత్ హైస్కూల్‌కు మూడు అదనపు తరగతి గదుల నిర్మాణం, జిల్లా పరిషత్ నిధులు రూ.10 లక్షలతో పంట కాలువపై వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పనులను సర్పంచ్ సుబ్బరాజు, ఎంపీటీసీ గొట్టుముక్కల బలరామకృష్ణరాజు, మాజీ సర్పంచ్ మంతెన వెంకటరాజు, మాజీ ఎంపీటీసీ వేగేశ్న ప్రసాద్ రాజులతో కలిపి పరిశీలించారు. ఇప్పటికే గ్రామంలో సచివాలయ భవనం నిర్మించామని సుబ్బరాజు తెలిపారు. అదనపు తరగతి గదులు, వంతెన నిర్మాణ పనులు వేగంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కలిదిండి సత్తిరాజు, పంచాయతీ బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి ధర్మాన రాక

నరసాపురం రూరల్: రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదివారం నరసాపురంలో పర్యటించనున్నారు. తొలుత మంత్రి మధ్యాహ్నం 2.30 గంటలకు నరసాపురం పట్టణంలోని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు నివాసానికి చేరుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు మండలంలోని దర్బరేవు గ్రామంలో 1,754 ఎకరాల కంపెనీ భూములకు సంబంధించి 1,602 మంది రైతులకు దస్తావేజుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. జిల్లా పరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్ పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గ్రామదేవతలకు సారె సమర్పణ



కలశాలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కాళ్ల: స్థానిక గ్రామ దేవతలు మహంకాళమ్మ, వెంకమ్మవార్ల జాతర మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవార్లకు 400 కిలోలతో తయారు చేయించిన పలు రకాల స్వీట్లు, పండ్లు పసుపు, కుంకుమ, గాజులతో మేళ తాళాలు మంగళ వాయిద్యాలు నడుమ సుమారు 200 మంది మహిళలు సారె బిందెలు, కావిళ్లతో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవార్లకు సారె సమర్పించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు.

జగన్ పాలనను మెచ్చిన జనం

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు
- మూడోరోజు కుముదవల్లిలో 'గడపగడపకు మన ప్రభుత్వం'



కుముదవల్లిలో లబ్ధిదారులకు పథకాల బ్రోచర్ అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

పాలకోడేరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు అన్నారు. పాలకోడేరు మండలం కుముదవల్లి గ్రామంలో శనివారం మూడో రోజు ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలన, పథకాల అమలుతీరుపై ఆరా తీశారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీవీఎల్ నరసింహరాజు మాట్లాడుతూ కులం, మతం, వర్గం బేధం లేకుండా అన్నివర్గాల ప్రజలకూ మంచిపాలన జననేత జగన్ అందిస్తున్నారని చెప్పారు. ఇల్లు లేని ప్రతి పేదవాడికీ స్థలం ఇవ్వడమే కాకుండా నిర్మాణానికి రుణ సదుపాయం కల్పించి సొంత గూడు అనే కల నెరవేర్చుతున్నారని వివరించారు. అగ్రవర్ణాల్లో వెనుకబడిన వారికీ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. జగన్ హయాంలో అన్ని వర్గాల వారికీ పథకాల లబ్ధి చేకూరుతోందని తెలిపారు. ప్రజలు సంతోషంగా ఉన్నారని, జగన్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని చెప్పారు. టీడీపీ హయాంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని గుర్తుచేశారు. ఎంపీపీ భూపతిరాజు చంటిరాజు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పీవీఎల్ నరసింహరాజుని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతి రాజు వంశీకృష్ణంరాజు, భూపతిరాజు రవికుమార్‌రాజు, భూపతిరాజు జగన్నాధరాజు, అంగరాజు సత్తిబాబు, ఉపసర్పంచ్ వడ్లమూడి బాబ్జి, తొమ్మిడేళ్ల సుబ్రహ్మణ్యం, మంచిన నరేష్, తంగేళ్ల నరసింహస్వామి, సుబ్రహ్మణ్యం, కందికట్ల పెద్దమోషేను ఎంపీటీసీ సభ్యులు తోట ఆలిస్‌మేరీ, కాటూరి శాంతకుమారి, కరోతి వెంకటలక్ష్మి, విస్సాకోడేరు సొసైటీ చైర్మన్ గెద్దం జోషి, కొండపల్లి శ్రీనివాస్ సర్పంచ్‌లు గొట్టుముక్కల శివాజీరాజు, జంగం సూరిబాబు, ఇంజేటి మరియమ్మ చెల్లబోయిన పాపారావు, శ్రీనివాసరాజు, వైస్ ఎంపీపీలు ఆదాడ లక్ష్మీతులసి, సోడదాసి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం అండ



రంజాన్ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కలిసిన ముస్లిం పెద్దలు

సాక్షి, భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం, మైనార్టీలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. రంజాన్ సందర్భంగా శనివారం ముస్లిం పెద్దలు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కలిసిన సందర్భంగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. ముస్లిం, మైనార్టీ వర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ అఫ్జల్ పాషా, సత్తర్ పాషా, అబ్దుల్, సుభాని, సిలార్, మహబూబ్ పాషా పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు

ఉండి: రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు ఉండి మండలంలో శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనాలు చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అందరూ బాగుండాలని అల్లాను వేడుకున్నట్టు ఉండి మసీదు ఇమామ్ షేక్ అర్షద్ అహ్మద్ తెలిపారు. రంజాన్ నెలలోనే కాకుండా మిగిలిన అన్ని రోజులూ పవిత్రంగా ఉండి దేవుడిని సంతోషపెట్టాలన్నారు. అల్లా మనకిచ్చిన సంపద నుంచి నిరుపేదలకు దానం చేస్తూనే ఉండాలని సూచించారు. అనంతరం సేమియా పంపిణీ చేశారు. ప్రార్థనల్లో ముస్లిం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆకివీడులో ర్యాలీ

ఆకివీడు: స్థానిక పెద్ద మసీదు నుంచి తీగలదొడ్డిలోని ర్యాలీగా ముస్లింలు మసీదుకు చేరుకున్నారు. అక్కడ ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు ఎండీ మదనీ, డాక్టర్ బిలాల్, సుఫీ ఖాదరీ, మస్తాన్‌వలీ, ఎండీ జహంగీర్, సిద్దిక్, ఎండీ జక్కీ, గోరేబాబు, అజ్మీర్, ఆలీ, అజ్మల్, ఆరీఫ్, మాబూ, సాజిత్, పరాద్, ఎస్కే సుభానీ, షమీమ్, షాబీర్ తదితరులు పాల్గొన్నారు.

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

పాలకోడేరు: మండలంలో ముస్లింలు రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మసీదుల్లో ప్రార్థనలు చేశారు. శృంగవృక్షం, పెన్నాడ గరగపర్రు గ్రామాల్లో ముస్లింలు ఆత్మీయ విందు చేసుకున్నారు. తహసీల్దార్ షేక్ హుస్సేన్‌కు రేషన్ షాపు డీలర్లు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ షేక్ పాప సాహెబ్, షేక్ సత్తార్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



ఉండిలో సేమియా పంపిణీ చేస్తున్న ముస్లింలు



తీగలదొడ్డిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



గరగపర్రులో ఆలింగనం చేసుకుంటున్న దృశ్యం

22 పాఠశాలల్లో నాడు- నేడు పనులు

ఆకివీడు: మండలంలో రెండో విడత నాడు నేడు పనులు 22 పాఠశాలల్లో ప్రారంభించినట్టు ఎంఈఓ శనివారం తెలిపారు. ఆయా పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నట్టు చెప్పారు. మండలంలోని నందమిల్లిపాడు, తాళ్లకోడు గ్రామాల్లోని పాఠశాలల్లో పనులు మొదలు పెట్టలేదని, తాళ్లకోడులో పాత భవనం సామర్థ్యాన్ని పరిశీలించడం వల్ల ఆలస్యమైందని ఎంఈఓ తెలిపారు.

వేసవి కోర్సులకు 240 దరఖాస్తులు

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేసవి సందర్భంగా స్కిల్ హబ్ ద్వారా మూడు నెలల ఉచిత శిక్షణకు అనూహ్య స్పందన వచ్చిందని ప్రిన్సిపాల్ కె.సుజాత శనివారం తెలిపారు. ఆయా కోర్సుల్లో శిక్షణ పొందేందుకు 240 మంది దరఖాస్తు చేసుకున్నట్టు చెప్పారు. శిక్షణలో డేటా ఎంట్రీ కోర్సుకు 120 మంది, పైథాన్ సాఫ్ట్‌వేర్ కోర్సుకు 60 మంది, బ్యూటీషియన్ కోర్సుకు 60 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ ముగిసినట్టు ప్రిన్సిపాల్ వివరించారు.

వేసవిలో పశువుల ఆరోగ్యంపై అప్రమత్తం

భీమవరం అర్బన్: వేసవిలో పాడి పశువుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని మండల పశు వైద్యాధికారి పి.పుండరీబాబు సూచించారు. భీమవరంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. నల్ల గేదెలకు ఎండ వల్ల వడదెబ్బ తగిలే అవకాశాలున్నాయన్నారు. పశువులను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు గాలి, వెలుతురు తగిలేలా నీడలో కట్టేయాలన్నారు. 24 గంటలు చల్లని నీరు గేదెలకు అందుబాటులో ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేసవిలో గేదెలు తాగే నీటిలో కొద్దిగా ఉప్పు కలపాలన్నారు.

అండలూరు సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం



అండలూరు సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

వీరవాసరం: సొసైటీ పాలకవర్గాలు రైతులకు అండగా నిలవాలని ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గ నాగమల్లేశ్వరరావు(బాబు) అన్నారు. అండలూరులో కోపరేటివ్ బ్యాంక్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొని శనివారం ఆయన మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ సీపీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. రైతుల శ్రేయస్సు ,సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు. త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా మానుకొండ ప్రదీప్ కుమార్, సభ్యులుగా చావాకుల రాజేష్ కుమార్, బొంతు కాళిదాసు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన త్రిసభ్య కమిటీని వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా నూతన త్రిసభ్య కమిటీ చైర్మన్ మానుకొండ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు, వైఎస్సార్ పార్టీకి ఎప్పుడు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గూడూరు ఓంకారం , మాజీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చావాకుల సత్యనారాయణ మూర్తి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గొలగాని సత్యనారాయణ, ఎంపీటీసీ బొల్లంపల్లి శ్రీనివాస్ చౌదరి, కార్యదర్శి లింగం శ్రీనివాస్, చికెలే మంగతాయారు, గడ్డం భారతి, నల్లమిల్లి వేణుక, మానుకొండ వెంకటేశ్వరరావు, నూకల కనకారావు, బోను జ్యోత్స్నాదేవి, చింతపల్లి కొండ, కోడె అప్పారావు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

రైతుల ప్రయోజనాలకు సొసైటీలు కృషి చేయాలి

సాక్షి, భీమవరం: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు ప్రయోజనం చేకూర్చేవిధంగా సహకార సంఘాల నూతన పాలకవర్గాలు పని చేయాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. వీరవాసరం మండలం అండలూరు కోఆపరేటివ్ బ్యాంక్ నూతన త్రిసభ్య కమిటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ మానుకొండ ప్రదీప్, సభ్యులు చవ్వాకుల రాజేష్‌కుమార్, బొంతు కాళిదాసు శనివారం క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రైతులతోనే రాష్ట్రాభివృద్ధి ముడిపడి ఉందని అందువల్లనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటుచేసి వాటిలో రైతులకు అవసరమైన వ్యవసాయ సమాచారంతోపాటు ఎరువులు, పురుగు మందులు తక్కువ ధరకే విక్రయించే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. గతంలో దళారుల చేతిలో నష్టపోయిన రైతులను నష్టాల ఊబి నుంచి బయటకు తీసుకురావడానికి వారు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వమే నేరుగా ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందన్నారు. కేవలం వరి రైతులకు మాత్రమే మేలు చేసే విధంగా గాకుండా వాణిజ్య పంటలు, ఆక్వా పంటలను పండించే రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోతున్న రైతులకు ఎప్పటికప్పుడు పంట నష్టపరిహారం అందిస్తూ చేదోడుగా ఉంటున్నట్లు శ్రీనివాస్ చెప్పారు. సహకార సంఘాలను ప్రభుత్వం బలోపేతం చేయడంతోపాటు రైతులకు మరిన్ని సేవలందించే విధంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. సహకార సంఘాలు, కోఆపరేటివ్ బ్యాంకుల త్రిసభ్య కమిటీలు రైతులకు అండగా ఉండేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే శ్రీనివాస్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాలదుర్గానాగమల్లేశ్వరరావు(బాబు), వైఎస్సార్ మండల పార్టీ కన్వీనర్ గూడూరి ఓంకార్, సర్పంచ్ నల్లిమిల్లి వేణుక, గొలగాని సత్యనారాయణ, నూకల కనకారావు, పంజా సురేష్ పాల్గొన్నారు.

వేధింపులపై కేసు నమోదు

కాళ్ల: గృహిణిని వేధిస్తున్న ఘటనపై కాళ్ల పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామానికి చెందిన మహాలక్ష్మికి పెన్మెత్స బాపిరాజుతో 2012లో వివాహం జరిగింది. అప్పట్లో ఆమె కట్నం కింద రూ.10 లక్షలు, మరో రూ.7 లక్షలు ఆడపడుచు కట్నం, సారె సామానం కూడా ఇచ్చారు. తాగుడు, జూదం, వ్యభిచారం వంటి దురలవాటులకు బానిసైన బాపిరాజు వైవాహిక జీవనంలో కలహాలు రేగాయి. ఈ తరుణంలో భార్య మహాలక్ష్మిని మానసికంగా, శారీరకంగా కొట్టి వేధింపులకు గురిచేస్తున్నాడు. దీనికి ఆడపడుచు, ఆమె భర్త, బావ సహకరిస్తున్నారని మహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు.

ఫాన్సీ స్టోర్‌లో చోరీ

ఉండి: ఉండి సెంటర్ ఆకివీడు రోడ్డులోని ఫ్యాన్సీస్టోర్‌లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. తాడికొండ గోపీ అనే వ్యక్తి తన ఫాన్సీ స్టోర్‌కు తాళం వేసి వెనుకనే ఉన్న ఇంటికి వెళ్లిపోయాడు. శనివారం ఉదయం షాపు తెరిచేందుకు రాగా షట్టర్ పగులగొట్టి ఉంది. రూ.50 వేలు చోరీ జరిగినట్టు గుర్తించిన గోపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై అడబాల శ్రీనివాస్ తెలిపారు.

తాళంవేసి ఉన్న ఇంట్లో బంగారం చోరీ

కాళ్ల: కలవపూడి గ్రామంలో ఇంటి తాళం పగలగొట్టి బంగారం చోరీ చేసిన ఘటనపై కాళ్ల పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. కలవపూడికి చెందిన సైకిల్ మెకానిక్ సాసుపల్లి వీరవెంకట దుర్గాప్రసాద్ ఈ నెల 18 తేదీ సాయంత్రం 6 గంటలకు తన ఇద్దరు పిల్లలతో కలిసి మచిలీపట్నం తన తోడల్లుడు ఇంటికి వెళ్లారు. తిరిగి 22న సుమారు మధ్యాహ్న 12 గంటలకు కలవపూడి ఇంటికి వచ్చి చూడగా బీరువాలో ఉన్న ఒక కాసు బంగారపు గొలుసు, ఒక కాసు మ్యాటీలు, ఒక కాసు చెవిలీలు దొంగిలించుకుపోయినట్టు గుర్తించారు. బాధితుడిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై మూర్తి తెలిపారు.